సాక్షి వరంగల్

సోమవారం । 18 । ఆగస్టు । 2025



తెలంగాణ సైన్స్ కాంగ్రెస్‌కు వేళాయె..

కాకతీయ యూనివర్సిటీలో ఈనెల 19, 20, 21 తేదీల్లో మూడు రోజులపాటు తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ నిర్వహించనున్నారు. - 8లో ▸



కేఎంటీపీ పనులు పూర్తిచేయాలి

కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు అభివృద్ధి పనులను సత్వరమే పూర్తిచేయాలని టీజీఐఐసీ చైర్మన్ శశాంక అధికారులను ఆదేశించారు. - 8లో ▸

గరిష్టం/కనిష్టం
26^0 / 23^0

వాతావరణం

జిల్లాలో ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం అక్కడక్కడా వర్షం కురుస్తుంది.

న్యూస్‌రీల్

వర్ధన్నపేటకు మీనాక్షి నటరాజన్

- ఖరారైన పాదయాత్ర షెడ్యూల్

వర్ధన్నపేట: ఏఐసీసీ తెలంగాణ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ పాదయాత్ర షెడ్యూల్ ఖరారైంది. ఈ నెల 25న సాయంత్రం వర్ధన్నపేటకు చేరుకుని పాదయాత్ర నిర్వహించనున్నారు. 26న ఉదయం శ్రమదానం, కార్మికులతో సమావేశం కానున్నారు. వర్ధన్నపేట నియోజకవర్గంలో పార్టీని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా కార్యక్రమం ఉంటుందని ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఆదివారం తెలిపారు. కార్యక్రమాలను విజయవంతం చేయడానికి విస్తృతంగా ఏర్పాట్లు చేయనున్నట్లు, ఈ పనులను ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పర్యవేక్షిస్తున్నట్లు పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. పాదయాత్రలో గ్రామస్థాయిలో ప్రజలతో మమేకమై వారి సమస్యలను అడిగి తెలుసుకుంటారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు తమ భవిష్యత్తు ప్రణాళికలను కూడా ప్రజలకు వివరిస్తారు. మహేశ్‌కుమార్ గౌడ్, మీనాక్షి నటరాజన్ పర్యటన నేపథ్యంలో వర్ధన్నపేటలో పండుగ వాతావరణం నెలకొంటుందని, కార్యక్రమానికి భారీగా ప్రజలు, కార్యకర్తలు హాజరవుతారని భావిస్తున్నారు.

సాక్షి ఫొటోగ్రాఫర్లకు రాష్ట్రస్థాయి అవార్డులు




పెద్దపల్లి వరప్రసాద్, వేణుగోపాల్

హన్మకొండ కల్చరల్/జనగామ: ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని సాక్షి ఫొటోగ్రాఫర్లను రాష్ట్రస్థాయి అవార్డులకు ఎంపిక చేశారు. వరంగల్‌కు చెందిన సాక్షి సీనియర్ స్టాఫ్ ఫొటోగ్రాఫర్ పెద్దపల్లి వరప్రసాద్, జనగామ ఫొటోగ్రాఫర్ గోవర్ధనం వేణుగోపాల్ ఉత్తమ వార్త చిత్రాల పోటీల్లో బహుమతులకు ఎంపికయ్యారు. తెలంగాణ స్టేట్ ఫొటో జర్నలిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 19న హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో వారికి అవార్డులు ప్రదానం చేయనున్నారు.

కలెక్టరేట్‌లో నేడు ప్రజావాణి

న్యూశాయంపేట: ప్రజాసమస్యల పరిష్కారంలో భాగంగా వరంగల్ కలెక్టరేట్‌లో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ సత్యశారద ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు జరిగే ప్రజావాణిలో ప్రజలు తమ సమస్యలను విన్నవించుకోవాలని తెలిపారు.

నేడు నులిపురుగుల నివారణ కార్యక్రమం

గీసుకొండ: జిల్లాలో నులిపురుగుల నివారణ కోసం 0–19 సంవత్సరాల వారికి ఆల్బెండజోల్ మాత్రలు వేసే కార్యక్రమాన్ని చేపట్టినట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ బి.సాంబశివరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 11న ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోని వారికి సోమవారం వేస్తారన్నారు. 0–2 సంవత్సరాల వయస్సులోపు వారికి సగం ట్యాబ్లెట్‌ను నీళ్లలో వేసి తాగించాలని, ఆపైన వయస్సు నుంచి 19 ఏళ్ల లోపు వారు పూర్తి ట్యాబ్లెట్‌ను నమిలి మింగాలని సూచించారు. పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో చేపట్టే ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి వైద్యాధికారులు, సిబ్బంది, సంబంధిత శాఖల వారు కృషి చేయాలని కోరారు. కార్యక్రమాన్ని డీఐవో డాక్టర్ ప్రకాశ్ పర్యవేక్షిస్తారని పేర్కొన్నారు.

డీఈఈసెట్-25 స్పాట్ అడ్మిషన్లు

విద్యారణ్యపురి: పాఠశాల విద్యాశాఖ ఆదేశాల మేరకు 2025–27 విద్యాసంవత్సరానికి డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డీఎల్‌ఈడీ) రెండేళ్ల కోర్సు కళాశాలల్లో (ప్రభుత్వ, ప్రైవేట్) వారీగా స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు హనుమకొండ జిల్లా విద్యాశిక్షణా సంస్థ ప్రధానాచార్యుడు ఎండీ అబ్దుల్‌హై ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏ కళాశాలలోనూ (ప్రభుత్వ, ప్రైవేట్) సీటు పొందలేదని రిపోర్ట్, జాయిన్ కాని అభ్యర్థులు మాత్రమే స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియకు హాజరుకావాలన్నారు. వరంగల్, హనుమకొండలో విద్యాశిక్షణ సంస్థలో ఖాళీ సీట్లలోనే భర్తీ చేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ డైట్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లకు ఈనెల 19న హాజరు కావాలని, ఈ నెల 21న సీటు పొందిన అభ్యర్థులు కాలేజీలో రిపోర్టు చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ప్రైవేట్ డైట్ కళాశాలల్లో ఈనెల 20న స్పాట్ అడ్మిషన్లకు హాజరు కావాల్సి ఉంటుందని, సీటు పొందినవారు 21న కళాశాలలో రిపోర్ట్ చేయాల్సి ఉంటుందన్నారు. వివరాలకు హెచ్‌టీటీపీఎస్//డీఈఈసెట్.సీడీఎస్‌ఈ.తెలంగాణ.గౌట్.ఇన్ వెబ్‌సైట్‌ను చూడాలని సూచించారు.

ఇంకా 'ఇన్‌స్పైర్' కాలేదు!

- 'ఇన్‌స్పైర్ మనక్' అవార్డుల నామినేషన్లు వేయించేందుకు పెద్దగా ఆసక్తి చూపని హెచ్‌ఎంలు, టీచర్లు
- 789తో మహబూబాబాద్ రాష్ట్రంలోనే మొదటి స్థానం
- మిగిలిన జిల్లాల్లో తక్కువగా వేసిన విద్యార్థులు



విద్యారణ్యపురి: విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకు ఇన్‌స్పైర్ అవార్డు మనక్ చక్కటి వేదికగా నిలుస్తోంది. విద్యార్థులు భావిభారత శాస్త్రవేత్తలుగా ఎదిగేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. ఇందులో.. భాగంగా శాస్త్రసాంకేతిక శాఖ (డీఎస్‌టీ), నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ (ఎన్‌ఐఎఫ్) ద్వారా ప్రతి సంవత్సరం ఇన్‌స్పైర్ అవార్డుల మనక్ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. అన్ని యాజమాన్యాల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్, కేజీబీవీ, మోడల్ స్కూళ్లు, వివిధ గురుకులాల్లోని ఆరో తరగతి నుంచి పదో తరగతి చదువుతున్న విద్యార్థుల మేధస్సుకు పదును పెడుతోంది. 2025–26 విద్యాసంవత్సరంలో ఒక్కో పాఠశాలల నుంచి ప్రాజెక్టుల రూపకల్పనకు ఐదు చొప్పున నామినేషన్లు స్వీకరిస్తున్నారు. జూన్ 15 నుంచి ఆగస్టు 15 వరకు మహబూబాబాద్ జిల్లా మినహా మిగిలిన ఐదు జిల్లాల్లో విద్యార్థులతో నామినేషన్లు చేయించేందుకు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పెద్దగా ఆసక్తి చూపలేదు. మహబూబాబాద్ జిల్లా 789 నామినేషన్లతో రాష్ట్రంలోనే మొదటి స్థానం దక్కించుకుంది. సెప్టెంబర్ 15 వరకు గడువు ఉండడంతో ఇంకా నామినేషన్లు పెరిగే అవకాశం ఉంది.

నామినేషన్ల ప్రక్రియ ఇలా..

- హెచ్‌టీటీపీఎస్//డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఇన్‌స్పైర్ అవార్డ్స్–డీఎస్‌టీ.గౌట్.ఇన్ ద్వారా లేదా గూగుల్ ప్లేస్టోర్‌లో ఇన్‌స్పైర్ మనక్‌యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలి. స్కూల్ అథారిటీ ద్వారా యూజర్ ఐడీ, పాస్‌వర్డ్‌తో లాగిన్ అయ్యి విద్యార్థుల ఆవిష్కరణ వివరాలను నమోదు చేయడంతోపాటు నమోదు ప్రక్రియ పూర్తి చేసుకోవచ్చు. హెచ్‌ఎంలు, గైడ్ టీచర్ల సహకారంతో విద్యార్థులతో ప్రాజెక్టులకు సంబంధించి నామినేషన్లు పంపించాలి.

ఇన్‌స్పైర్ నామినేషన్‌కు కావాల్సినవి..

- విద్యార్థి సృజనాత్మక ఆలోచన లేదా ప్రాజెక్టు సంక్షిప్త నివేదిక రెండు వేల పదాలకు మించకూడదు.
- విద్యార్థి ఆధార్ కార్డుతో అనుసంధానించిన ఏదైనా జాతీయ బ్యాంకు లేదా పోస్టాఫీస్ ద్వారా జారీచేసిన పొదుపు ఖాతా పాస్‌పుస్తకం, విద్యార్థి పాస్‌ఫొటో, వివరాలు, ఫోన్‌నంబర్, గైడ్ టీచర్ వివరాలు కూడా ఉండాలి.

సైన్స్ టీచర్లు ఎక్కువగా శ్రద్ధ వహిస్తేనే..

ఉమ్మడి జిల్లాలోని డీఈఓలు, జిల్లా సైన్స్ అధికారులు ఇప్పటికే అన్ని యాజమాన్యాల పాఠశాలల హెచ్‌ఎంలతో సమావేశాలు నిర్వహించారు. ఇన్‌స్పైర్ అవార్డులకు నూతన ఆవిష్కరణల ప్రాజెక్టులతో విద్యార్థులతో నామినేషన్లు చేయించాలని ఆదేశించారు. నామినేషన్లు చేయించేందుకు ఏమైనా సందేహాలుంటే నివృత్తి చేసుకునేందుకు స్కూల్ కాంప్లెక్స్ స్థాయిలో టెక్నికల్ టీంలు కూడా ఏర్పాటుచేశారు. పాఠశాలల్లో ఐడియా బాక్స్‌లను ఏర్పాటు చేయాలని ఆదేశించినా ఆ దిశగా అడుగు ముందుకు పడలేదు. ప్రధానంగా సైన్స్ టీచర్లు ఎక్కువగా శ్రద్ధ వహిస్తే నామినేషన్లు పెరిగే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. హెచ్‌ఎంలు, టీచర్లలో కొంత నిర్లిప్తత కూడా కారణమని తెలుస్తోంది. మహబూబాబాద్ జిల్లాలో మాత్రం డీఈఓ, సైన్స్ అధికారి ప్రత్యేక దృష్టిసారించడంతో నామినేషన్లు బాగా అయ్యాయని తెలుస్తోంది.

జిల్లాల వారీగా నామినేషన్ల వివరాలు..

జిల్లా	నామినేషన్ల సంఖ్య
మహబూబాబాద్	789
హనుమకొండ	30
వరంగల్	45
ములుగు	30
జయశంకర్	10
జనగామ	25

ఎంపికైతే ఒక్కో విద్యార్థి నామినేషన్‌కు రూ.10 వేలు..

ఇన్‌స్పైర్ అవార్డుకు ప్రాజెక్టు రూపకల్పన చేసి వెబ్‌సైట్ ద్వారా పంపితే ఎంపికైన విద్యార్థికి రూ.10వేల చొప్పున బ్యాంకు ఖాతాలో జమచేస్తారు. విద్యార్థి వినూత్న ఆవిష్కరణలకు సంబంధించి నమూనా రూపొందించేందుకు, ప్రయాణ ఖర్చులకు ఈ డబ్బులు వినియోగించుకునే అవకాశం ఉంటుంది. జిల్లాస్థాయిలో ఇన్‌స్పైర్ అవార్డుల ప్రాజెక్టులకు సంబంధించిన నమూనా ప్రదర్శనలు నవంబర్‌లో నిర్వహిస్తారు. ఇందులో ప్రతిభ కనబర్చిన వారిని రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్, ఇందులో ప్రతిభ కనబరిస్తే జాతీయస్థాయికి వెళ్లే అవకాశం ఉంటుంది. జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిస్తే జపాన్ వంటి దేశాల పర్యటనకు కూడా ఎంపిక చేస్తారు. అలా ఎంపికైన వారికి రూ.25వేల పారితోషికం కూడా అందజేస్తారు.

నామినేషన్లు పంపించాలి..



ఇన్‌స్పైర్ అవార్డులకు నామమాత్రంగానే నామినేషన్లు పంపారు. విద్యార్థుల్లోని ప్రతిభ వెలికితీసేందుకు ఒక చక్కటి వేదిక ఇన్‌స్పైర్ అవార్డు మనక్. అన్ని యాజమాన్యాల పాఠశాలలు తమ విద్యార్థులను ప్రోత్సహించాల్సి ఉంటుంది. అందుకు ఒక ఐడియాతో ప్రాజెక్టుకు సంబంధించి సంక్షిప్తంగా వివరాలు పంపించాలి. హెచ్‌ఎంలు, టీచర్లు ప్రత్యేక శ్రద్ధ వహించి సెప్టెంబర్ 15లోగా విద్యార్థులతో నామినేషన్లు పంపాలి.

– ఎస్.శ్రీనివాసస్వామి, హనుమకొండ జిల్లా సైన్స్ అధికారి

గ్రీన్‌ఫీల్డ్ హైవే బ్రిడ్జి ఎత్తు తగ్గించొద్దు

- కేంద్రమంత్రి బండి సంజయ్‌ను వేడుకున్న గ్రామస్తులు



కేంద్రమంత్రి బండి సంజయ్‌కి వినతిపత్రం అందిస్తున్న గ్రామస్తులు

నెక్కొండ: నాగపూర్–విజయవాడ గ్రీన్‌ఫీల్డ్ హైవే బ్రిడ్జి ఎత్తు తగ్గించడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని అలంకానిపేట, తోపనపల్లి, వెంకటాపురం, అప్పల్‌రావుపేట గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ఈమేరకు ఆదివారం కరీంనగర్‌లో కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌ని కలిసి గ్రామస్తులు తమ గోడు వెల్లబోసుకున్నారు. ఆయా గ్రామాల ప్రజలు పలువురు మాట్లాడుతూ.. గ్రీన్‌ఫీల్డ్ హైవే 163జీ బ్రిడ్జి నెక్కొండ–కేసముద్రం ప్రధాన గ్రామాల నుంచి వెళ్తోందని, అలంకానిపేట–అప్పల్‌రావుపేట మధ్య నిర్మిస్తున్న బ్రిడ్జి ఎత్తు 20 ఫీట్లకు బదులు 14 ఫీట్లకు తగ్గించి పనులు చేపడుతున్నారని తెలిపారు. పరిసర గ్రామాల రైతులు పంట ఉత్పత్తుల విక్రయానికి కేసముద్రం, నెక్కొండ వ్యవసాయ మార్కెట్ తీసుకెళ్తారని, కేవలం ట్రాక్టర్లు, బస్సుల రాకపోకలను దృష్టిలో ఉంచుకొని పనులు చేపడుతూ..అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. ధాన్యం, మిర్చి, పత్తి లోడ్ లారీలు పోవడానికి ఇబ్బందులు ఏర్పటే ప్రమాదం ఉందని వారు వాపోయారు. నిత్యం రద్దీగా ఉండే రహదారి భవిష్యత్తులో మూతపడే అవకాశాలున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రీన్‌ఫీల్డ్ నిబంధనలకు లోబడి 20 ఫీట్ల ఎత్తుకు పెంచాలని వారు కోరారు. వరంగల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు గంట రవికుమార్, కరీంనగర్ 1వ వార్డు కార్పొరేటర్ శ్రీనివాస్ సమక్షంలో కేంద్రమంత్రిని కలవడం జరిగిందన్నారు. మంత్రి సానుకూలంగా స్పందించి, కేంద్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి గడ్కరీ దృష్టికి తీసుకవెళ్లి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారని వారు పేర్కొన్నారు.

ముంపు నివారణకు శాశ్వత చర్యలు చేపట్టండి

- ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కమిషనర్ శశాంక
- ముంపు ప్రభావిత ప్రాంతాల్లో క్షేత్ర స్థాయి పరిశీలన



భద్రకాళి బండ్‌ను పరిశీలిస్తున్న అధికారులు

రామన్నపేట: నగరం ముంపునకు గురవకుండా ప్రణాళిక ప్రకారం.. శాశ్వత చర్యలు చేపట్టాలని ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రత్యేకాధికారి, ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కమిషనర్ శశాంక అధికారులను ఆదేశించారు. ఆదివారం బల్దియా కమిషనర్ చాహత్‌బాజ్‌పాయ్ వివిధ విభాగాల అధికారులతో కలిసి భద్రకాళి బండ్, చిన్న వడ్డేపల్లి చెరువు ఐసీసీసీ కేంద్రాల్లో క్షేత్ర స్థాయిలో పర్యటించారు. సమర్థంగా వరద ముంపును ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు సూచనలిచ్చారు. భద్రకాళి చెరువు సమీపంలో ముంపునకు గురయ్యే ఎన్టీఆర్ నగర్, బృందావన్ కాలనీ, సంతోషిమాత కాలనీల పరిస్థితి తెలుసుకున్నారు.

శాశ్వత పరిష్కారానికి నిర్మాణాలు చేపట్టాలి

నగరంలోని వరద నీటి తీవ్రత స్థాయి అంచనాకు వివిధ విభాగాలు సమన్వయంతో పని చేయాలని శశాంక ఆదేశించారు. నగరంలోని లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురవకుండా భద్రకాళి బండ్ ఇన్ లెట్ వద్ద వాస్తవ సామర్థ్యం? ఇన్ ఫ్లో? ఔట్ ఫ్లో తదితర విషయాల అధ్యయనానికి ఇరిగేషన్, బల్దియా, ఇంజనీరింగ్, రెవెన్యూ, టౌన్ ప్లానింగ్ విభాగాల సమన్వయం చేసుకోవాలని సూచించారు. భద్రకాళి చెరువు నిలువ సామర్థ్యాన్ని పెంచి వరద ముంపునకు గురికాకుండా నీటిని నిలువరించేలా చర్యలు చేపట్టాలన్నారు.

కంట్రోల్ కేంద్రం పరిశీలన

కమాండ్ కంట్రోల్ కేంద్రాన్ని శశాంక పరిశీలించి అధికారులకు సూచనలిచ్చారు. వర్షాకాలం నేపథ్యంలో నగరంలోని ప్రతీ చెరువుకు సంబంధించి నీటి ప్రవాహం ఇన్‌ఫ్లో, ఔట్ ఫ్లో సమాచారం ప్రతీ వార్డును ఎప్పటికప్పుడు అప్రమత్తం చేసేలా సమాచారం అందజేయాలన్నారు. సీఎంహెచ్‌ఓ రాజారెడ్డి, ఇన్‌చార్జ్ ఎస్‌ఈ సిటీ ప్లానర్లు మహేందర్, రవీందర్ రాడేకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సాంబశివరావు



చెన్నారావుపేట ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని సందర్శించిన జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి

నర్సంపేట: వైద్య సిబ్బంది ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ వైద్యసేవలు అందించాలని వరంగల్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సాంబశివరావు సూచించారు. ఈమేరకు చెన్నారావుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలోని రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులపై వైద్యసిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ భద్రయ్య, స్టాఫ్‌నర్స్ హేమలత, హెల్త్ అసిస్టెంట్ శివాజీ తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి..

ఖానాపురం: వైద్యాఆరోగ్యశాఖలో పనిచేసే ఉద్యోగులకు సెలవులు ఉండవని, సమయపాలన తప్పకుండా పాటించాలని జిల్లా వైద్యాఆరోగ్యశాఖ అధికారి సాంబశివరావు ఆదేశించారు. ఈమేరకు మండల కేంద్రంలోని పీహెచ్‌సీని ఆదివారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా రికార్డులను పరిశీలించి సూచనలు చేశారు. త్వరలోనే ఫేషియల్ అటెండెన్స్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీసీ నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాక్టర్ నుంచి బస్తాలు దింపుతూ..

- జారిపడి హమాలీకి తీవ్రగాయాలు
- చికిత్స పొందుతూ మృతి



వేల్పుల రాజు(ఫైల్)

సంగెం: ట్రాక్టర్ నుంచి ధాన్యం బస్తాలు దింపుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు జారీ కిందపడి ఓ హమాలీ తీవ్రగాయాలతో చికిత్స పొందుతూ మృతిచెందాడు. స్థానికులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం..మండలంలోని గవిచర్ల గ్రామానికి చెందిన వేల్పుల ఎలిషా, నర్సయ్య దంపతులకు కుమారుడు రాజు(26), ఒక కూతురు ఉన్నారు. కూతురు వివాహం కాగా రాజుకు వివాహం కాలేదు. తండ్రి నర్సయ్య పక్షవాతంతో మంచానపడ్డాడు. తల్లి కూలికి, రాజు హమాలీ పనికి వెళ్లేవాడు. రోజువారీ పనిలో భాగంగా రాజు ఈ నెల 15న ఆశాలపల్లిలోని కేదారేశ్వర రైస్ మిల్లులో హమాలీ పనికివెళ్లాడు. ధాన్యం బస్తాలు ట్రాక్టర్ నుంచి దింపుతున్న క్రమంలో అదుపుతప్పి కిందపడిపోగా మర్మాంగాలకు, కాళ్లు, చేతులకు తీవ్రగాయాలయ్యాయి. ఇంటికి వెళ్లి ఆర్‌ఎంపీతో ఇంజక్షన్ వేయించుకున్నాడు. శనివారం ఉదయం వరకు రాజు తీవ్ర అస్వస్థతకు గురికాగా ఎంజీఎం తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం సాయంత్రం మృతిచెందాడు. కాగా ఈ విషయం గురించి ఎస్సై నరేశ్‌ను వివరణ కోరగా రాజు మృతిచెందింది వాస్తవమేనని, ఫిర్యాదు అందలేదన్నారు.

ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌వి చిల్లర మాటలు

- బరాజ్‌ను బాంబులతో పేల్చారనడం అవివేకం
- బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్



మాట్లాడుతున్న బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్

హన్మకొండ: బీఆర్‌ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ అజ్ఞానపు, చిల్లర మాటలు మాట్లాడుతున్నాడని బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ అన్నారు. ఆదివారం హనుమకొండ దీన్‌దయాళ్ నగర్‌లోని బీజేపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మేడిగడ్డ బరాజ్‌ను ఎవరో బాంబులతో పేల్చారు అని ఆర్‌ఎస్ ప్రవీణ్ మాట్లాడడం అవివేకం అన్నారు. కమీషన్ల కోసం నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు నాసిరకం పనుల కారణంగా కూలిపోయింది తప్ప బాంబు పేలుళ్లతో కాదన్నారు. బీజేపీపై అసత్య ప్రచారం చేస్తున్నారని.. ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ తస్మాత్ జాగ్రత్త! నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడు.. అని కొండేటి ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ నాయకులపై అసత్య ప్రచారం చేసి.. బీఆర్‌ఎస్ చేసిన అవినీతిని కప్పిపుచ్చే కుట్రలో ఆర్‌ఎస్ ప్రవీణ్ భాగమవుతున్నారని విమర్శించారు. కేసీఆర్ కుటుంబంపై తీవ్ర విమర్శలు చేసిన రేవంత్‌రెడ్డి ఇప్పుడు ఒక్క చర్య తీసుకోకపోవడం కాంగ్రెస్, బీఆర్‌ఎస్ చీకటి ఒప్పందానికి నిదర్శనమన్నారు. సమావేశంలో ఎస్సీ మోర్చా హనుమకొండ జిల్లా అధ్యక్షుడు సంప్ర మధు, వరంగల్ జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు మార్టిన్ లూథర్, నాయకులు జన్ను మధు, ఎన్.శివకృష్ణ, వెంకటేశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సహకారం మరింతగా..

- పీఏసీఎస్ చైర్మన్ల పదవీ కాలం ఆరు నెలలు పొడిగింపు
- కీలక సాగు సమయంలో రైతులకు ప్రయోజనకరం
- జిల్లాలో 98 పీఏసీఎస్ సొసైటీలు



సొసైటీల నుంచి రైతులకు రుణాలు అందిస్తున్న చైర్మన్ రమణారెడ్డి(ఫైల్)

నర్సంపేట: సొసైటీల నుంచి రైతులకు అందనున్న సేవలు మరో ఆరు నెలలు పొడిగించడం వారికి ఎంతో ప్రయోజనకరం కానుంది. పంటల సాగులో రైతులకు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల నుంచి పలు రకాల సేవలు అందాలంటే స్థానికంగా అందుబాటులో ఉంటున్న చైర్మన్ల కృషి ఎంతో ఉంటుంది. ఈనెల 14వ తేదీన చైర్మన్ల పదవీ కాలం ముగియడంతో ఒకింత రైతులు ఆందోళన చెందారు. ప్రధానంగా వరంగల్ జిల్లాలో వరి పంట అధికంగా సాగు చేస్తున్న రైతులకు యూరియా, డీఏపీ అందించడంలో సొసైటీ చైర్మన్ల పాత్ర కీలకంగా మారింది. జిల్లాలో 98 పీఏసీఎస్ సొసైటీలు ఉన్నాయి. షెడ్యూల్ ప్రకారం ఈనెల 14వ తేదీ వరకు పదవీ కాలం ముగిస్తే 2026 ఫిబ్రవరి 14లోపు ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుంది. స్థానిక సంస్థల ఎన్నికలు, మునిసిపాలిటీ ఎన్నికలు రాక ముందే పీఏసీఎస్ ఎన్నికలు నిర్వహించడం సాధ్యపడదని భావించిన రాష్ట్ర ప్రభుత్వం చైర్మన్ల పదవీ కాలం మరో ఆరు నెలలు పొడిగించినప్పటికీ ఖరీఫ్‌లో రైతుల పంటలకు అందాల్సిన సేవలను దృష్టిలో ఉంచుకొని కూడా పదవీ కాలం పెంచి ఉంటారని తెలుస్తోంది. దీంతో సొసైటీ చైర్మన్లతో పాటు పాలకవర్గం పంటల సాగు రెండు సీజన్ల ప్రక్రియ చైర్మన్ల చేతుల మీదుగానే సాగుతుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఆశించిన స్థాయిలో యూరియా అందుబాటులో లేకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వం సొసైటీల ద్వారా యూరియా అందించి రైతుల అవసరాలు తీర్చుతోంది. రైతులకు కావాల్సిన యూరియా సొసైటీ పరిధిలోని పంటల సాగును అంచనా వేసి అవసరమైన యూరియాను అందించడంలో సహకార సంఘాల పాత్ర ఎంతగానో ఉంది. దీనిలో భాగంగా సొసైటీ చైర్మన్లు అధికారులతో పాటు ప్రజాప్రతినిధులకు నివేదికలు ఎప్పటికప్పుడు అందిస్తూ కావాల్సినంత యూరియా సమకూర్చుకుని రైతులకు సరఫరా చేస్తున్నారు. జిల్లాలోని రైతులు కూడా సొసైటీ చైర్మన్ల పదవీ కాలం పొడిగించడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రైతులకు మరింత సేవ చేసే అవకాశం..



పీఏసీఎస్‌ల ద్వారా రైతులకు పలు రకాల సేవలను అందించే అవకాశం మరో ఆరు నెలలు పొడిగించడంపై ఆనందం వ్యక్తం చేశారు. అన్ని రకాల రుణాలను అందిస్తూ ధాన్యాన్ని కొంటూ పంటల సాగుకు అవసరమైన యూరియా, డీఏపీలను అందించడంలో నిష్పక్షపాతంగా వ్యవహరిస్తున్నాం.

–బొబ్బాల రమణారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ నర్సంపేట

రెండో ఫ్లోర్‌లోకి వీసీ చాంబర్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిపాలనా భవనంలోని మొదటి అంతస్తులో కొనసాగుతున్న వీసీ చాంబర్ ఈనెల 18న(సోమవారం) ఇదే భవనంలోని రెండో అంతస్తులోకి మార్చనున్నారు. చాంబర్స్ ఆఫ్ వైస్ చాన్స్‌లర్ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని మధ్యాహ్నం 12:15 గంటలకు నిర్వహించనున్నట్లు కేయూ రిజిస్ట్రార్ రామచంద్రం ఆదివారం తెలిపారు. ఈకార్యక్రమానికి బోధన, బోధనేతర ఉద్యోగులు, పాలక మండలి సభ్యులు, విద్యార్థులు హాజరుకావాలని ఆయన కోరారు. అన్ని హంగులతో తీర్చిదిద్దిన వీసీ చాంబర్ పక్కనే ఉన్న హాల్‌ను అకడమిక్ కమిటీ హాల్‌గా కూడా ఉపయోగించుకోనున్నారు.

రేపటినుంచి విస్తృతోపన్యాసాలు

కేయూ క్యాంపస్: తెలంగాణ సైన్స్ కాంగ్రెస్‌లో భాగంగా ఫార్మసీ రంగంలో వస్తున్న కీలక మార్పులు, పరిణామాలపై విస్తృతోపన్యాసాలు నిర్వహించనున్నట్లు ఫార్మసీ డీన్ ఆచార్య గాదె సమ్మయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 19న మధ్యాహ్నం 2 గంటలకు ఫార్మసీ కళాశాల సెమినార్‌హాల్‌లో వరంగల్ కాకతీయ వైద్య కళాశాల గైనకాలజీ విభాగం అధిపతి ప్రొఫెసర్ రామా సరళాదేవి ఉపన్యసిస్తారని పేర్కొన్నారు. 20న ములుగు ప్రభుత్వ వైద్య కళాశాల హెచ్‌ఓడీ ప్రొఫెసర్ వి.చంద్రశేఖర్, 21న హైదరాబాద్‌లోని పల్స్ ఫార్మాస్యూటికల్ సైంటిస్టు రాంబాబుదేవరాజు ఉపన్యసిస్తారని తెలిపారు.


ఆర్టీసీ బస్సు ఢీకొని వృద్ధురాలి మృతి

వర్ధన్నపేట: ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో మండలంలోని ఇల్లంద గ్రామంలో ఓ వృద్ధురాలు అక్కడికక్కడే మృతిచెందింది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన తూళ్ల యాకమ్మ(60) కిరాణ షాపులో సామాను కొనడానికి వరంగల్–ఖమ్మం రహదారిపై ఎడమ వైపు నడుచుకుంటూ వెళ్తోంది. అదే సమయంలో వరంగల్ నుంచి తొర్రూరు వైపునకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు డ్రైవర్ అతివేగంగా, అజాగ్రత్తగా నడుపుకుంటూ పక్కన పోతున్న వాహనాన్ని ఓవర్‌టేక్ చేస్తున్న క్రమంలో తూళ్ల యాకమ్మ, సాతుపల్లి కుమారస్వామిని ఢీకొట్టింది. తూళ్ల యాకమ్మ ఎగిరి కిందపడగా బస్సు వెనుకటైర్లు తనమీదనుండి వెళ్లగా రెండు కాళ్లు నుజ్జునుజ్జయి అక్కడికక్కడే మృతిచెందింది. దెబ్బలు తగిలిన సాతుపల్లి కుమారస్వామిని చికిత్స కోసం ఎంజీఎం తరలించారు. మృతురాలి మనవడు తూళ్ల శ్రీకాంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు భూక్య చందర్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి..

నల్లబెల్లి: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని రుద్రగూడెం శివారులో ఆదివారం సాయంత్రం జరిగింది. ఎస్సై గోవర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం..గోవిందరావుపేట గ్రామానికి చెందిన నేతావత్ వెంకన్న(55) తన ద్విచక్రవాహనంపై గోవిందరావుపేట నుంచి మరిపెడ వెళ్తున్నాడు. ఇదే క్రమంలో రుద్రగూడెం శివారులోని జాతీయ రహదారి మూలమలుపు వద్ద వాహనం అదుపుతప్పి కిందపడింది. దీంతో వెంకన్నకు తీవ్రగాయాలు కాగా అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతదేహాన్ని నర్సంపేట మార్చురీకి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ముగిసిన పేరిణి నాట్య ప్రవేశిక పరీక్షలు



హన్మకొండ కల్చరల్: విద్యార్థులకు నిర్వహించిన పేరిణి నాట్య ప్రవేశిక స్థాయి పరీక్షలు ఆదివారం ముగిశాయి. వరంగల్‌లోని నాగార్జున హైస్కూల్‌లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు 180 మంది విద్యార్థులకు థియరీ, ప్రాయోగిక, మౌఖిక పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షలకు అకాడమీ నిర్వాహకుడు గజ్జెల రంజిత్‌కుమార్ చీఫ్ ఎగ్జామినర్‌గా, విద్యారణ్య ప్రభుత్వ సంగీత నృత్య కళాశాల పేరిణి నాట్య అధ్యాపకురాలు చాతరాజు నవ్యజ ఇంటర్నల్‌గా, హైదరాబాద్‌కు చెందిన పేరిణి గురువు సందీప్ ఎక్స్‌టర్నల్‌గా విధులు నిర్వర్తించారు.

తెలంగాణ సైన్స్ కాంగ్రెస్‌కు వేళాయె..

● కేయూ ఆడిటోరియం వేదికగా షురూ..

రేపటి నుంచి 21వ తేదీ వరకు నిర్వహణ

కేయూ క్యాంపస్: తెలంగాణ అకాడమీ సైన్సెస్, కాకతీయ యూనివర్సిటీ సంయుక్తంగా కాకతీయ యూనివర్సిటీలో ఈనెల 19, 20, 21 తేదీల్లో మూడు రోజులపాటు తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ నిర్వహించనున్నారు. ఈ మేరకు యూనివర్సిటీ అధికారులు ప్రొఫెసర్లతో కూడిన 13 కమిటీలను నియమించి సన్నాహాలు చేస్తున్నారు. ఈ సైన్స్ కాంగ్రెస్ 'ఇన్నోవేటివ్ స్కిల్స్ ఫర్ ఎంపవర్‌మెంట్, సైన్స్ అండ్ టెక్నాలజీ ఫర్ ట్రాన్స్ఫార్మింగ్' ఇండియా అనే అంశంపై కొనసాగనుంది. అంతేగాకుండా మరో ఏడు థీమ్స్‌లలోనూ ప్లీనరీ సెషన్స్ జరగనున్నాయి. ఫిజికల్ అండ్ మ్యాథ్‌మెటికల్ సైన్స్, ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ, కెమికల్ సైన్సెస్, లైఫ్‌సైన్స్ అండ్ అగ్రికల్చరల్ సైన్సెస్, మెడికల్ హెల్త్ అండ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్, ఎర్త్ ఓసియన్ అట్మాస్పియర్, ఎన్విరాన్‌మెంటల్ సైన్సెస్‌లోనూ ప్లీనరీ సెషన్స్ ఉంటాయి.

విద్యార్థులు, టీచర్లకు రిజిస్ట్రేషన్ లేకుండానే..

తెలంగాణ సైన్స్ కాంగ్రెస్‌లో యూనివర్సిటీల కళాశాల అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులకే గాకుండా హైస్కూల్‌స్థాయి విద్యార్థులు, టీచర్లు కూడా పాల్గొనేందుకు అవకాశం కల్పించారు.

విద్యార్థులు, టీచర్లతో సైంటిస్టుల ఇంటారాక్షన్..

సైన్స్ కాంగ్రెస్‌లో ఈనెల 19న మధ్యాహ్నం విద్యార్థుల, టీచర్లు, యువతతో ప్రముఖ సైంటిస్టుల ఇంటరాక్షన్ ఉంటుంది. ప్రస్తుతం సీసీఎంబీ మాజీ డైరెక్టర్ సి.హెచ్.మోహన్‌రావు, డీఆర్‌డీఓ రిటైర్డ్ సైంటిస్టు మార్తా ఎస్‌రెడ్డి, వరంగల్ నిట్ రిటైర్డ్ కెమిస్ట్రీ ప్రొఫెసర్ ఎ. రామచంద్రయ్య, డీఆర్‌డీఓ మాజీ డైరెక్టర్ డాక్టర్ ఎన్. ఈశ్వరప్రసాద్‌తో ఇంటారాక్షన్ ఉంటుంది.

ప్లీనరీ సెషన్–1లో..

తొలిరోజు ప్లీనరీ సెషన్ -1లో హైదరాబాద్ సీసీఎంబీ డైరెక్టర్ డాక్టర్ కె. నందికూరి, బెంగుళూరులోని డీఆర్‌డీఓ ఎల్‌ఆర్‌డీఈ డైరెక్టర్ జి. విశ్వమ్ వివిధ అంశాలపై లెక్చర్స్ ఉంటాయి. మరోవైపు సమాంతరంగా ఓరల్ పేపర్ల ప్రజెంటేషన్లు, పోస్టర్ ప్రజెంటేషన్లు క్యాంపస్‌లోని ఫిజిక్స్, మ్యాథ్‌మెటిక్స్, ఫార్మసీ, జువాలజీ, కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ సెమినార్‌హాళ్లలో నిర్వహిస్తారు.



తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ నిర్వహించనున్న కేయూ ఆడిటోరియం

బెస్ట్ పేపర్, బెస్ట్ పోస్టర్ ప్రజెంటేషన్లకు అవార్డులు..

మూడురోజులపాటు వివిధ యూనివర్సిటీల నుంచి వచ్చే ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు సమర్పించే వాటిల్లో 7బెస్ట్ పేపర్ల ప్రజెంటేషన్లు, 7బెస్ట్ పోస్టర్ ప్రజెంటేషన్లను కూడా ఎంపిక చేస్తారు. మొత్తం 14 ఎంపికచేస్తారు. వీరికి ముగింపు సభలో అతిథుల చేతుల మీదుగా ప్రశంస పత్రాలు అందజేస్తారు.

700 మంది వరకు ప్రతినిధులు వచ్చే అవకాశం..

తెలంగాణతోపాటు ఇతర రాష్ట్రాల్లోని వివిధ యూనివర్సిటీల నుంచి ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు, వివిధ కంపెనీలకు సంబంధించిన వారికి సంబంధించి మొత్తం 630 రిజిస్ట్రేషన్లు అయ్యాయి. ఈనెల 19న కూడా ఉదయం స్పాట్ రిజిస్ట్రేషన్ ఉంటుంది. ఆ విధంగా 650 నుంచి 700 మంది వరకు ప్రతినిధులు హాజరయ్యే అవకాశం ఉంది.

సెనేట్‌హాల్‌లో విద్యార్థులతో సైంటిస్టులతో ఇంటరాక్షన్..

సైన్స్‌లో వివిధ విభాగాల్లో ప్రభుత్వ యాజమాన్యంలోని 9,10 తరగతి విద్యార్థులు తమ సృజనాత్మకత నూతన ఆవిష్కరణలతో కూడిన ఎగ్జిబిట్లను ప్రదర్శించుకునేందుకు అవకాశం కల్పిస్తున్నారు. ఇన్‌స్పైర్, సైన్స్ ఫెయిర్ మాదిరి సైన్స్‌టీచర్ల సహకారంతో ఎగ్జిబిట్లను తీసుకొస్తే ఆడిటోరియం వద్దనే ప్రదర్శించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. హైస్కూల్‌స్థాయి విద్యార్థులు, టీచర్లతో సైంటిస్టుల ఇంటరాక్షన్ కార్యక్రమం కూడా ఉంటుంది. ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి సుమారు 250 మందికిపైగా విద్యార్థులతోపాటు సైన్స్ టీచర్లు పాల్గొంటారని భావిస్తున్నారు. ఈనెల 20న మహిళా సైంటిస్టులతో సెనేట్ హాల్‌లో మీట్ ఉంటుంది. వివిధ ఉప అంశాల్లో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెంట్, బయోఈ-3, స్పేస్ ప్రోగ్రామ్స్, యంగ్‌సైంటిస్టు మీట్ ఉంటుంది.

సర్వం సిద్ధం..



సైన్స్ కాంగ్రెస్ విజయవంతమయ్యేలా వివిధ కమిటీలతో ఏర్పాట్లు సిద్ధం చేశాం.సైంటిస్టులు, పరిశోధకులు, విద్యార్థులు ప్రముఖ సంస్థలకు చెందిన వారు ఒకచోట చేరి చర్చించడం ద్వారా నూతన ఆవిష్కరణలకు అవకాశం కలగడంతోపాటు విద్యార్థుల్లో సైన్స్‌పై ఆసక్తి పెంపొందించేందుకు ఈ సమావేశం దోహద పడుతుంది.

- ప్రొఫెసర్ బి. వెంకట్రామ్‌రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ, తెలంగాణ సైన్స్ కాంగ్రెస్

చీఫ్ గెస్ట్‌గా డీఆర్‌డీఓ మాజీ చైర్మన్ సతీశ్‌రెడ్డి

కేయూ ఆడిటోరియంలో ఈనెల 19న కేయూ వీసీ కె. ప్రతాప్‌రెడ్డి అధ్యక్షతన జరుగనున్న తెలంగాణ సైన్స్‌కాంగ్రెస్ ప్రారంభ సమావేశానికి డీఆర్‌డీఓ మాజీ చైర్మన్, సైంటిఫిక్ అడ్వయిజర్ మినిస్ట్రీ ఆఫ్ డిఫెన్స్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా డాక్టర్ జి. సతీశ్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొనబోతున్నారు. గౌరవ అతిథిగా తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ వి. బాలకిష్టారెడ్డి హాజరుకానున్నారు. 21న సాయంత్రం జరిగే ముగింపు సమావేశానికి కడప యోగివేమన మాజీ వీసీ ఎ.రామచంద్రారెడ్డి, తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా ముఖ్యఅతిథులుగా పాల్గొననున్నారు.

పాము కాటుతో వృద్ధురాలి మృతి



లక్ష్మి(ఫైల్)

భూపాలపల్లి రూరల్: పాము కాటుతో ఓ వృద్ధురాలు మృతిచెందింది. ఈ ఘటన ఆదివారం భూపాలపల్లి మండలం నాగారంలో చోటు చేసుకొంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కన్నెబోయిన పెద్ద లక్ష్మి (70) శనివారం ఇంట్లో భోజనం చేస్తున్న క్రమంలో కాలుకు పాము కాటు వేసింది. దీంతో కుటుంబ సభ్యులు, బంధువులు వెంటనే వంద పడకల ఆస్పత్రికి తీసుకొచ్చారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. ఈ ఘటనపై మృతురాలి కుమారుడు విజేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బైక్‌ను ఢీకొన్న కారు..

● యువకుడి దుర్మరణం
● ఇద్దరికి గాయాలు

భూపాలపల్లి అర్బన్: ఓ కారు.. బైక్‌ను ఢీకొన్న ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. ఈ ఘటన ఆదివారం తెల్లవారుజామున భూపాలపల్లి–కాటారం ప్రధాన జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. సీఐ నరేశ్ కుమార్ కథనం ప్రకారం.. మండలంలోని గడ్డిగానిపల్లి గ్రామానికి చెందిన కొండగుర్ల రాజేందర్(30) తన మిత్రులు నల్లూరి జలంధర్, గజ్జ వెంకటేష్‌తో కలిసి ద్విచక్రవాహనంపై నాగారంలో పొలం వద్దకు వెళ్లి వస్తున్నారు. ఈ క్రమంలో బొగ్గులవాగు సమీపంలో భూపాలపల్లి నుంచి కాటారం వైపు వెళ్తున్న కారు అదుపు తప్పి ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ఘటనలో రాజేందర్ అక్కడికక్కడే మృతి చెందాడు. జలంధర్, వెంకటేష్‌కు గాయాలు కావడంతో హనుమకొండలోని ఓ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. ఈ ఘటనపై మృతుడి తండ్రి పోచయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు. మృతుడికి భార్య, కూతురు ఉన్నారు.

క్లుప్తంగా

గ్రామగ్రామాన పాపన్న గౌడ్ జయంతి వేడుకలు నిర్వహించాలి

హన్మకొండ: సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలు ఈ నెల 18న గ్రామ గ్రామాన ఘనంగా నిర్వహించాలని సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఉత్సవ కమిటీ రాష్ట్ర కన్వీనర్ వడ్లకొండ వేణుగోపాల్ పిలుపునిచ్చారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఆయా జిల్లా కలెక్టరేట్లలో సోమవారం ఉదయం 10 గంటలకు జరిగే పాపన్న గౌడ్ జయంతి ఉత్సవాల్లో జిల్లాలోని గౌడ కులస్తులు, బీసీలు పెద్ద ఎత్తున పాల్గొనాలని ఆయన ఆదివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. రాబోయే ఎన్నికల్లో పాపన్న గౌడ్‌ను స్ఫూర్తిగా తీసుకుని గ్రామాల్లో బీసీ జెండా ఎగుర వేయాలన్నారు. అదే విధంగా హైదరాబాద్ రవీంద్ర భారతిలో నిర్వహించే జయంతికి రాష్ట్ర వ్యాప్తంగా గౌడ కులస్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు.

శుభకార్యానికి వెళ్లి వచ్చేలోగా చోరీ..

● 12 తులాల బంగారు, 25 తులాల వెండి ఆభరణాలు, రూ.15 వేల నగదు అపహరణ
● మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ఘటన



బీరువా తలుపులు తొలగించిన దొంగలు

మహబూబాబాద్ రూరల్ : ఓ శుభ కార్యానికి వెళ్లి వచ్చేలోగా మానుకోటలో ఓ ఇంట్లో చోరీ జరిగింది. ఈ ఘటనలో దుండగులు 12 తులాల బంగారు, 25 తులాల వెండి ఆభరణాలతో పాటు రూ.15 వేల నగదు అపహరించుకెళ్లారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని నర్సంపేట బైపాస్ సమీపంలో జరిగిన ఘటన వివరాలను ఆదివారం బాధితురాలు భూక్య శారద తెలిపారు. నర్సంపేట బైపాస్ సమీపంలో కిరాణా షాపు నిర్వహించుకుని జీవించే శారద శనివారం దంతాలపల్లి మండలంలోని తమ బంధువుల ఇంట్లో జరిగిన వివాహ వేడుకకు వెళ్లింది. ఆదివారం ఉదయం ఇంటికి వచ్చి చూడగా తలుపు తాళాలు పగలగొట్టి ఉండడంతో పాటు ఇంట్లో గల బీరువా తలుపులు తొలగించి ఉన్నాయి. దీంతో ఆ ప్రాంతంలో పరిశీలించి చూడగా బీరువాలో భద్రపరిచిన 12 తులాల బంగారు ఆభరణాలు, 25 తులాల వెండి ఆభరణాలు, రూ.15 వేల నగదు కనిపించలేదు. దీంతో చోరీ జరిగిందని గుర్తించి వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వగా ఫింగర్ ప్రింట్ బృందం సభ్యులు ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. అనంతరం ఈ ఘటనపై బాధితులు మహబూబాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు

ఇద్దరు విలేకరులపై కేసు నమోదు

వరంగల్ క్రైం: వరంగల్ జిల్లా విద్యాశాఖ అధికారి, ఆయన కార్యాలయంలో గతంలో అసిస్టెంట్ ప్రోగ్రాం ఆఫీసర్‌గా పనిచేసిన రావుల రాజగోపాల్‌రెడ్డిపై నిబంధనలకు విరుద్ధంగా నిరాధారమైన వార్తలు రాసిన రెండు పీడీఎఫ్ పత్రికల విలేకరులపై ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ రంజిత్‌కుమార్ తెలిపారు. ఇష్టారీతిన వార్తలు రాశారని రాజగోపాల్‌రెడ్డి ఫిర్యాదు మేరకు విలేకరులు సాంబమూర్తి, రావుల రాజేశంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.



వివాహేతర సంబంధాన్ని ప్రశ్నించడంతో..

భర్తపై హత్యాయత్నం
● ఈ ఘటనలో భార్య, ప్రియుడి అరెస్ట్, ముగ్గురి పరారీ
● వివరాలు వెల్లడించిన మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్



వివరాలు వెల్లడిస్తున్న ఇన్‌స్పెక్టర్ కరుణాకర్

రామన్నపేట : వివాహేతర సంబంధాన్ని ప్రశ్నించడంతో భర్తపై హత్యాయత్నం చేయించిన ఘటనలో భార్యతోపాటు ప్రియుడిని అరెస్ట్ చేసినట్లు మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం పీఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. నగరంలోని రామన్నపేట రఘునాథ్‌కాలనీ చెందిన గంగరబోయిన పద్మకు కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలం మోత్కులగూడేనికి చెందిన పోతుల సందీప్‌తో మూడు సంవత్సరాల క్రితం వరంగల్ బస్టాండ్ వద్ద పరిచయం ఏర్పడింది. ఈ క్రమంలో సందీప్‌తో స్నేహం చేసేలా పద్మ తన భర్త రాజుతో అతడి వద్ద చిట్టీలు వేయించింది. దీంతో సందీప్, రాజు మధ్య స్నేహం ఏర్పడింది. ఈ క్రమంలో రాజు ఇంట్లో లేని సమయంలో సందీప్.. అతడి ఇంటికి తరచూ వస్తున్నాడు. దీనిపై అనుమానం వచ్చిన రాజు.. పద్మను, సందీప్‌ను ప్రశ్నించాడు. దీంతో రాజు వివాహేతర సంబంధానికి అడ్డు వస్తున్నాడనే కారణంతో ఈ నెల 14వ తేదీన సందీప్ తన స్నేహితులు ప్రమోద్, సబ్బీర్, స్వర్ణాకర్‌తో కలిసి పోతన డంపింగ్ యార్డు వద్ద రాజుపై దాడికి పాల్పడగా అతడు అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. ఈ విషయాన్ని గమనించిన స్థానికులు రాజును ఆస్పత్రికి తరలించగా ప్రాణపాయస్థితి నుంచి బయటపడ్డాడు. ఈ ఘటన జరిగిన వెంటనే పద్మ..రాజుపై హత్యాయత్నం చేసిన సందీప్‌కు రూ. 3 లక్షలు అందజేసింది. రాజు బతికి ఉన్నాడనే విషయం తెలుసుకున్న పద్మ అదే రాత్రి ఇంటిలో ఉన్న మరో రూ. 6 లక్షలు తీసుకుని సందీప్‌తో వెళ్లిపోయింది. ఈ ఘటనపై రాజు కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. ఆదివారం మధ్యాహ్నం హనుమాన్ జంక్షన్ వద్ద సందీప్, పద్మను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మరో ముగ్గురు ప్రమోద్, సబ్బీర్, స్వర్ణాకర్ పరారీలో ఉన్నారు. వీరి వద్ద నుంచి రూ. 5.40 లక్షల నగదు, ఓ కారు, రెండు స్మార్ట్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ కరుణాకర్ తెలిపారు. సమావేశంలో ఎస్సైలు శ్రీనివాస్, సాంబయ్యలు, హెడ్‌కానిస్టేబుల్ రాజేందర్ పాల్గొన్నారు.

చిన్నారుల అప్పగింత



ఇద్దరు చిన్నారులను తల్లికి అప్పగిస్తున్న జీఆర్ పోలీసులు

కాజీపేట: అనారోగ్య కారణాలతో తల్లి రైలు దిగింది. మళ్లీ ఎక్కడానికి యత్నించగా రైలు వెళ్లిపోయింది. ఈ ఘటనలో రైలులో ఉండిపోయిన ఇద్దరు కూతుళ్లను కాజీపేట రైల్వే పోలీసులు గుర్తించి తల్లికి అప్పగించారు. జీఆర్పీ సీఐ నరేశ్ కథనం ప్రకారం.. రాఖీ అనే మహిళ తన ఇద్దరు పిల్లలు చాందిని, ఆదిత్యతో కలిసి గోరఖ్‌పూర్ -యశ్వంతాపూర్ రైలులో ప్రయాణిస్తోంది. రైలు రామగుండం వచ్చేసరికి రాఖీకి వాంతులు కావడంతో దిగి ముఖం శుభ్రం చేసుకుంది. ఈ తరుణంలో సిగ్నల్ పడడంతో రైలు వెళ్లింది. దీంతో వెంటనే ఆమె రామగుండం జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ తిరుపతికి విషయం చెప్పడంతో ఆయన కాజీపేట పోలీసులకు సమాచారం అందజేశారు. ఎస్సై అభినవ్ ఆధ్వర్యంలో సిబ్బంది రైలును ఆపి పిల్లలను గుర్తించి తల్లికి అప్పగించినట్లు సీఐ వివరించారు.

కొమ్మ కత్తిరింపుతో ప్రయోజనం

ముదురు మామిడి తోటల్లో అధిక దిగుబడి
● కత్తిరింపునకు ప్రభుత్వం రాయితీ
● ఎకరాకు రూ.9,600 చొప్పున అందజేత
● ఐదెకరాల వరకు పరిమితి

హన్మకొండ: ముదురు మామిడి తోటల్లో కొమ్మ కత్తిరింపుతో అధిక దిగుబడి పొందొచ్చు. ఎత్తును అదుపులో ఉంచడంతోపాటు ఎక్కువ ఫలాలు కాసేలా చేయడానికి కొమ్మ కత్తిరింపు అవసరం. అలాగే, చెట్టు జీవితకాలాన్ని కూడా పెంచుతుంది. హనుమకొండ, వరంగల్ జిల్లాలో ముదురు తోటలు చాలా ఉన్నాయి. హనుమకొండ జిల్లాలో 6,100 ఎకరాలు, వరంగల్ జిల్లాలో 5,960 ఎకరాల్లో మామిడి తోటలు ఉన్నాయి. హనుమకొండ జిల్లాలో ఈ ఆర్థిక సంవత్సరం 12.5 ఎకరాలు, వరంగల్ జిల్లాలో 63 ఎకరాల్లో కొమ్మ కత్తిరింపు ముదురు తోటల పునరుద్ధరణ చేయాలని ప్రభుత్వం లక్ష్యం విధించుకుంది. ఇందులోభాగంగా ఎకరాకు రూ.9,600 చొప్పున ప్రతీ రైతుకు 5 ఎకరాల వరకు ఉద్యాన శాఖ ద్వారా రాయితీ అందిస్తోంది.

ముదురు తోటల్లో తగ్గుతున్న ఉత్పాదకత..

ముదురు తోటల్లో ఉత్పాదకత ప్రతీ సంవత్సరం గణనీయంగా తగ్గుతూ వస్తోంది. ఈ క్రమంలో 25 సంవత్సరాల పై బడిన ముదురు తోటల్లో కొమ్మ కత్తిరింపు ఆవశ్యకం. చెట్ల పాదులు, మొదలుపై సూర్యరశ్మి పడకపోవడంతో చీడపీడలు ఆశించి ఫలసాయం తగ్గుతుంది. అలాగే, చెట్లు ఏటవాలు, నిటారుగా పెరగడంతో సస్యరక్షణ యాజమాన్యం కష్టసాధ్యం. ఇలాంటి ముదురు తోటలను పునరుద్ధరణ ప్రక్రియ ద్వారా కత్తిరించాలి. తద్వారా సాంకేతిక యాజమాన్య పరిజ్ఞానం ద్వారా మళ్లీ నూతన మొక్కల వలే అధిక దిగుబడులు లభిస్తాయి.



చెట్టు ఆకృతి మారకుండా కత్తిరింపులు చేయాలి..

చెట్టు మొదలు భాగం నుంచి 4 మీటర్ల ఎత్తులో మొత్తం కొమ్మలను కత్తిరింపులు చేయాలి. చెట్టు ప్రధాన కాండంపై 3–4 ద్వితీయ క్రమ కాండాలను ఎంపిక చేసుకుని చెట్టు ఆకృతి మారకుండా కత్తిరింపులు చేసుకోవాలి. ఎంపిక చేసుకున్న కొమ్మలను కత్తిరింపు చేసే సమయంలో బెరడు, కొయ్య చీలకుండా ముందుగా కొమ్మ అడుగు భాగం 10–20 సెం.మీ లోతు కోసి తర్వాత పైభాగం కొయ్యాలి. మామిడి పండ్ల కోత తర్వాత నెల రోజుల నుంచి కొమ్మల కత్తిరింపు నవంబర్, డిసెంబర్ మాసం వరకు చేయొచ్చు. ఈ విధంగా కత్తిరించిన చెట్టుకు కొత్త రెమ్మలు, కొమ్మలు తొడిగి, కొమ్మలు ముదిరి కాపు రావడానికి 2 నుంచి 3 సంవత్సరాలు పడుతుంది. వీటి ద్వారా అధిక దిగుబడులు లభిస్తాయి.

కొమ్మలను రంపంతోనే కత్తిరించాలి..

కొమ్మలను రంపంతో కత్తిరించాలి. పెద్ద కొమ్మలు (20 సెం.మీ. వ్యాసం) కత్తిరించడానికి మోటారు (పెట్రోలు)తో నడిచే రంపాన్ని ఉపయోగించాలి.

కత్తిరింపుల తర్వాత యాజమాన్యం...

కొమ్మ కత్తిరింపుల తర్వాత చెట్టు వయసును బట్టి సిఫార్సు చేసిన ఎరువులను వేసి నీటి తడులు ఇవ్వాలి. ఎక్కువ సేంద్రియ, జీవ ఎరువులు వేసుకోవాలి. కాపుకు వచ్చిన తోటల్లో మొదటి కత్తిరింపుల తర్వాత తొలకరి వర్షాల సమయంలో ఎరువులు వేసుకుంటే మొక్కకు పోషకాలు అందుతాయి. ఒకవేళ వర్షాలు లేనిపక్షంలో నీటి తడులు ఇవ్వాలి. కొత్త చిగుర్లు వచ్చిన తర్వాత సూక్ష్మ ధాతు (జింకు, బోరాన్, ఇనుము మొదలైన) లోపాలు గమనిస్తే జింక్ 2-5 గ్రా, బోరాన్ 1–2 గ్రాములు, ఐరన్‌సల్ఫేట్ 2 గ్రాములు, మెగ్నీషియం సల్ఫేట్ 2 గ్రాములు లీటర్ నీటికి చొప్పున కలిపి పిచికారీ చేయాలి. నీటి యాజమాన్యాన్ని, పురుగులు, తెగుళ్ల యాజమాన్యాన్ని సరైన సమయంలో చేసుకోవాలి.

కొమ్మలను 45 డిగ్రీల కోణంలో కత్తిరింపు చేయాలి. కత్తిరింపుచేసే సమయంలో కొమ్మ కింది భాగం చీలకుండా చూడాలి. కత్తిరింపు తర్వాత కాపర్ ఆక్సిక్లోరైడ్ (బైటాక్స్) పేస్టు పూయాలి. చిన్న కొమ్మలను చేతి ద్వారా కత్తిరింపుచేసే సికేచర్ (లాంగీచ్ ప్రూనర్) ద్వారా కత్తిరింపు చేయాలి. సన్న పరిమాణం గల కొమ్మలను కత్తిరించే సమయంలో చిన్న సికేచర్ ఉపయోగించాలి. కత్తిరింపులు చేసేటప్పుడు కొంచెం ఏటవాలుగా చేయాలి. లేనిపక్షంలో వర్షం పడిన సమయంలో నీరు కొమ్మలపై ఉండిపోయి శిలీంద్రాలు ఆశించి చెట్టు చనిపోయే అవకాశం ఉంది. కొమ్మలు కత్తిరించిన ప్రతీ సారి కత్తిరించిన ప్రదేశంలో బోర్డో పేస్టు పూయాలి.

రాయితీని సద్వినియోగం చేసుకోవాలి..



మామిడి రైతులు ముదురు తోటలతో అధిగ దిగుబడి కోల్పోతున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వం ముదురు తోటల పునరుద్ధరణకు ప్రాధాన్యం ఇస్తోంది. ఇందులో భాగంగా కొమ్మ కత్తిరింపునకు రాయితీ అందిస్తోంది. ఈ రాయితీని ముదురు తోటల రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

-జి.అనసూయ, ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి, హనుమకొండ

కొమ్మ కత్తిరింపుతో అధిక దిగుబడి..



ముదురు తోటల్లో కొమ్మ కత్తిరింపు పునరుద్ధరణతో అధిక దిగుబడి వస్తుంది. 25 సంవత్సరాల తోటల్లో కొమ్మ కత్తిరింపు చేసుకోవాలి. రైతులు ఈ విధంగా కొమ్మ కత్తిరింపులు చేసుకుని తగిన యాజమాన్య చర్యలు చేపడితే నాణ్యమైన దిగుబడి వచ్చి అధిక ఆదాయం పొందుతారు.

-శ్రీనివాస్ రావు, ఉద్యాన, పట్టుపరిశ్రమ అధికారి, వరంగల్

కేఎంటీపీ పనులు వేగంగా పూర్తిచేయాలి

● టీజీఐఐసీ చైర్మన్ శశాంక
● కలెక్టర్, నిట్ ప్రొఫెసర్లతో కలిసి పరిశీలన



కేఎంటీపీలో పరిశ్రమలను పరిశీలిస్తున్న శశాంక, కలెక్టర్ సత్యశారద తదితరులు

గీసుకొండ: గీసుకొండ–సంగెం మండలాల పరిధిలోని కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు(కేఎంటీపీ)లో చేపడుతున్న అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన పనులను సత్వరమే పూర్తిచేయాలని టీజీఐఐసీ చైర్మన్, ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రత్యేక అధికారి శశాంక అధికారులను ఆదేశించారు. ఆదివారం కలెక్టర్ సత్యశారదతోపాటు పలువురు నిట్ ప్రొఫెసర్లు, అధికారులతో కలిసి కేఎంటీపీని సందర్శించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. వరద కాల్వ, రైల్వే ఓవర్ బ్రిడ్జి, మురుగునీటి శుద్ధి కేంద్రాలతో పాటు గణేశా ఎకో టెక్, యంగ్ వన్ కంపెనీలను పరిశీలించారు. వరద కాల్వ కోసం రూ.159 కోట్లతో పనులను చేపట్టగా పనులకు సంబంధించి నిట్ ప్రొఫెసర్లతో చర్చించి మెరుగైన పనులు చేపట్టే అవకాశాల గురించి చర్చించారు. మెరుగైన ప్రణాళిక ఉంటే చెప్పాలని వారిని కోరారు. రైల్వే బ్రిడ్జి నిర్మాణ పనులను పరిశీలించి వచ్చే మార్చి వరకు పూర్తి చేయాలని ఆదేశించారు. గణేశా, దక్షిణ కొరియా యంగ్ వన్ కంపెనీల్లో తయారవుతున్న వస్తువులను పరిశీలించారు. కార్యక్రమంలో టీజీఐఐసీ జోనల్ మేనేజర్ స్వామినాయక్, నీటిపారుదల శాఖ చీఫ్ ఇంజనీర్ వెంకటేశ్వర్లు, ఎస్‌ఈ హరిప్రసాద్, ఈఈ సునీత, డీఈ వేణుగోపాల్, డీఆర్‌ఓ విజయలక్ష్మి, ఆర్‌డీఓ సత్యపాల్ రెడ్డి, గీసుకొండ, సంగెం తహసీల్దార్లు ఎం.డి. రియాజొద్దీన్, రాజ్‌కుమార్, ఆర్‌ఐ సాంబయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రేమ్‌కుమార్ మృతదేహం లభ్యం

● మృతుడిది ఖమ్మం జిల్లా జెన్నారం ఎస్టీ కాలనీ



ప్రేమ్‌కుమార్ (ఫైల్)

గంగారం : మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం ఏడు బావుల జలపాతం వద్ద శనివారం సాయంత్రం గల్లంతైన ప్రాపర్తి ప్రేమ్‌కుమార్(23) మృతదేహం లభ్యమైంది. ఖమ్మం జిల్లా ఏన్కూరు మండలం జెన్నారం ఎస్టీ కాలనీకి చెందిన ప్రాపర్తి ప్రేమ్‌కుమార్ శనివారం బంధువులు, స్నేహితులతో కలిసి ఏడుబావుల జలపాతం వద్దకు వచ్చాడు. జలపాతం వద్ద పైనున్న బావులను చూసేందుకు వెళ్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు జారి బావిలో పడ్డాడు. దీంతో సహచరులు ఎంత గాలించిన ఆచూకీ లభించలేదు. ఈ క్రమంలో ఆదివారం మధ్యాహ్నం ప్రేమ్‌కుమార్ మృతదేహం లభ్యమైంది. కాగా, సరదాగా జలపాతం చూడడానికి వచ్చి శవమై కనిపించడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. ప్రేమ్ కుమార్ సోదరుడు సైతం గతంలో వరద ప్రమాదంలోనే మృతిచెందినట్లు స్థానికులు తెలిపారు. ఈ ఘటనపై బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవికుమార్ తెలిపారు.

మధ్యవర్తిత్వంతో కోర్టుల్లో కేసులు తగ్గించాలి

● తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ కార్యనిర్వాహక చైర్మన్, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి.సామ్ కోషి





మాట్లాడుతున్న హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ పి.సామ్‌కోషి, జస్టిస్ జె.శ్రీనివాసరావు

హన్మకొండ: మధ్యవర్తిత్వంతో కోర్టుల్లో కేసులు తగ్గించాలని తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ కార్యనిర్వాహక చైర్మన్, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి.సామ్ కోషి అన్నారు. హనుమకొండ నక్కలగుట్టలోని వరంగల్ డీసీసీబీ ప్రధాన కార్యాలయం ఆడిటోరియంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని జయశంకర్ భూపాలపల్లి, ములుగు, జనగామ, మహబూబాబాద్ జిల్లా న్యాయ సేవా సంస్థలు గుర్తించిన... మధ్యవర్తిత్వం భావన, సాంకేతికతపై సాధికారిత పొందిన న్యాయవాదుల 40 గంటల శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. జస్టిస్ పి.సామ్ కోషి పాల్గొని మాట్లాడుతూ కక్షిదారులు ఐచ్ఛికంగా సహకరించుకొని వివాదాలను పరిష్కరించుకొనే ఒక ప్రక్రియ మధ్యవర్తిత్వమన్నారు. మధ్యవర్తిత్వం ప్రపంచీకరించబడిందని, మధ్యవర్తిత్వం కోర్టుల భారాన్ని చాలా వరకు తగ్గిస్తుందన్నారు. కార్పొరేట్లు, వ్యాపారాలు, కంపెనీలు వివాదాల పరిష్కారం కోసం మధ్యవర్తిత్వాన్ని ఆశ్రయిస్తున్నాయన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మధ్యవర్తిత్వం వేగంగా అభివృద్ధి చెందడానికి ప్యానల్ న్యాయవాదులు, పారా లీగల్ వలంటీర్లు కృషిచేయాలని సూచించారు. మెడిటేషన్, ఆర్బిట్రేషన్ గవర్నర్స్ బోర్డు సభ్యుడు, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జె.శ్రీనివాసరావు మాట్లాడుతూ కక్షిదారుల సమస్యలను పరిష్కరించే విధంగా మధ్యవర్తిత్వం పనిచేస్తుందని తెలిపారు. వరంగల్, హనుమకొండ జిల్లాల ప్రధాన న్యాయమూర్తులు వీబీ నిర్మలా గీతాంబ, డాక్టర్ బి. పట్టాభిరామారావు, ఇతర జిల్లా న్యాయమూర్తులు నారాయణబాబు, మనీషా శ్రావణ్ ఉన్నమ్, వరంగల్, హనుమకొండ జిల్లాల న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శులు ఎం.సాయికుమార్, క్షమాదేశ్‌పాండే, బార్ కౌన్సిల్ మెంబర్లు దుస్స జనార్దన్, బైరపాక జయాకర్, వరంగల్, హనుమకొండ జిల్లాల న్యాయవాదుల సంఘం అధ్యక్షులు వలుస సుధీర్, పులి సత్యనారాయణ పాల్గొన్నారు. కాగా, జస్టిస్ పి.సామ్ కోషి వేయిస్తంభాల ఆలయంలో రుద్రేశ్వరుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అదే విధంగా హనుమకొండలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో ఆయనను హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు స్నేహశబరీశ్, సత్యశారద మర్యాదపూర్వకంగా కలిసి మొక్కలు అందజేసి స్వాగతం పలికారు.

పీజీ కోర్సుల మూడో సెమిస్టర్ రెన్యువల్ గడువు పెంపు

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని ఎంఏ, ఎంకామ్, ఎమ్మెస్సీ, ఎంసీఏ, ఎంటీఎం, ఎంఎస్‌డబ్ల్యూ, ఎమ్మెస్సీ ఇంటిగ్రేటెడ్ కెమిస్ట్రీ, బయోటెక్నాలజీ పీజీ కోర్సుల రెండో సెమిస్టర్ విద్యార్థులు 2025–2026 విద్యాసంవత్సరంలో మూడోసెమిస్టర్ అడ్మిషన్ కోసం రెన్యువల్‌కు గడువు ఈనెల 25వ తేదీ వరకు ఉందని యూనివర్సిటీ కాలేజీ ప్రిన్సిపాల్ మనోహర్ తెలిపారు. రూ. వెయ్యి అపరాధ రుసుముతో ఈనెల 26 నుంచి సెప్టెంబర్ 9వ తేదీవరకు మూడో సెమిస్టర్ అడ్మిషన్ కోసం రెన్యువల్ చేసుకునేందుకు అవకాశం ఇచ్చినట్లు ఆయన తెలిపారు.